క్లుప్తంగా

ఇంజినీరింగ్ సెక్షన్‌లో అంతర్గత బదిలీలు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ సెక్షన్‌లో అంతర్గత బదిలీలు చేస్తూ కమిషనర్ కీర్తి చేకూరి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కొత్తగా ఒక ఈఈ, ఇద్దరు డీఈలు, ఇద్దరు ఏఈలు విధుల్లో చేరడంతో వారికి వార్డులు కేటాయించారు. ప్రస్తుతం పనిచేస్తున్న ఏఈలు, డీఈఈలకు వార్డుల వారీగా వర్క్ కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. డివిజన్లకు కేటాయించిన ఇంజినీరింగ్ అధికారులు ఆయా ప్రాంతాల్లో తాగునీటి సమస్య రాకుండా చూడాలని, అభివృద్ధి పనులు వేగంగా జరిగేలా పర్యవేక్షణ చేయాలని ఆమె ఆదేశించారు.

బంగారు గొలుసు లాక్కొని ఆగంతుకుల పరారీ

గుంటూరు ఈస్ట్: వ్యక్తి మెడలోని బంగారు గొలుసు ఆగంతుకులు లాక్కొని పరారైన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. రాజేంద్రనగర్‌కు చెందిన పి.వెంకట శ్రీనివాసరావు శుక్రవారం తెల్లవారుజామున నడుచుకుంటూ బృందావన్ గార్డెన్స్ 7వ లైనులోకి వెళుతున్నారు. ఈ సమయంలో ఇద్దరు ద్విచక్ర వాహనంపై వచ్చి శ్రీనివాసరావు మెడలోని నాలుగు తులాల బంగారు గొలుసు తెంచుకుని పరారయ్యారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అసభ్యకర మెసేజ్ పంపుతున్న వ్యక్తిపై ...

మహిళ సెల్‌ఫోన్‌కు గుర్తు తెలియని వ్యక్తి అసభ్యకర మెసేజ్‌లు పంపుతున్న ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. మల్లికార్జునపేటకు చెందిన మహిళకు గుర్తు తెలియని వ్యక్తి తన సెల్ నంబరు నుంచి అసభ్యకర మెసేజ్‌లు పెడుతున్నాడు. దీంతో ఆమె శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు సినీ సంగీత విభావరి

పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో శనివారం సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు ఆర్ఎస్ ఈవెంట్స్ వ్యవస్థాపకురాలు మునిపల్లె రమణి ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో గాయకులు చిరంజీవి నటించిన చిత్రాల్లోని పాటలను ఆలపిస్తారని పేర్కొన్నారు. సంగీతాభిమానులు పాల్గొనాలని ఆమె కోరారు.

సమన్వయంతో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే ముస్తఫా

పట్నంబజారు: ప్రజా సమస్యల పరిష్కారం, నగర సమగ్రాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేస్తున్నారని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్‌ముస్తఫా, నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి చెప్పారు. శుక్రవారం నియోజకవర్గంలోని ప్రధాన అవుట్ ఫాల్ డ్రెయిన్, రైల్వే క్రాసింగ్ పాయింట్ అయిన రాజీవ్‌గాంధీనగర్ మెయిన్ గేట్, సుద్దపల్లిడొంక, పాత గుంటూరు ప్రధాన రహదారి, పొన్నూరు రోడ్డు, చంద్రబాబునాయుడు కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ దశల వారీగా అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు, ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా శివారు కాలనీలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. డ్రెయిన్లు, రోడ్లు సమస్యలు తలెత్తకుండా ప్రజలకు మేలు జరిగేలా పాటుపడతామని పేర్కొన్నారు. నగర కమిషనర్‌కు సమస్య వివరించగానే క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చారని, త్వరలో ఎప్పటి నుంచో ఉన్న మురుగు సమస్యకు పరిష్కారం దొరుకుందని చెప్పారు. అంతర్గత డ్రెయిన్లను కూడా రోజు శుభ్రం చేయించాలని, కార్పొరేటర్లు ప్రతిపాదించిన డ్రెయిన్లు, రోడ్లు మంజూరు చేయాలని కోరారు. నగర కమిషనర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ నగరంలో ఆయా డివిజన్ల పరిధిలో సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రజా సమస్యల పరిష్కారానికి స్థానిక ప్రజా ప్రతినిధుల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ప్రధానంగా తూర్పు నియోజకవర్గంలో ప్రధాన అవుట్ ఫాల్ డ్రెయిన్ మొండిగేటు వద్ద రైల్వే లైన్ క్రాసింగ్ పెండింగ్‌లో ఉండటం వల్ల తీవ్ర ఇబ్బందులు వస్తున్నాయని తెలిపారు. త్వరలో సమస్య పరిష్కారానికి రైల్వే ఉన్నతాధికారులతో ప్రత్యేక సమావేశమవుతున్నట్లు చెప్పారు. ఇక నుంచి వర్షాల వల్ల ప్రజలకు ఇబ్బందులు లేకుండా ప్రధాన అవుట్ ఫాల్ డ్రెయిన్ల నిర్వహణ కూడా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు కూడా వ్యర్థాల్ని కాల్వల్లో వేయకుండా ఇంటి వద్దకు వచ్చే ప్రజారోగ్య కార్మికులకు అందివ్వాలని, లేనిపక్షంలో మురుగు నిలిచి పొంగుతుందని చెప్పారు. పాత గుంటూరు మెయిన్ రోడ్డులోని డ్రెయిన్ కల్వర్ట్ వద్ద వ్యర్థాలు లేకుండా చూడాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. చంద్రబాబునాయుడు కాలనీ నుంచి ప్రధాన రోడ్డు కనెక్టివిటీ కోసం సర్వే చేసి సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని సిటీప్లానర్‌ని ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరి ఫాతిమా, పార్టీ నేతలు, నగరపాలక సంస్థ అధికారులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.



డ్రెయిన్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా, కమిషనర్ కీర్తి, అధికారులు

కార్యకర్తల్ని రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్న లోకేష్

పోలీసు స్టేషన్‌లో వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా సభ్యుల ఫిర్యాదు

పట్నంబజారు : యువగళం పాదయాత్రలో కార్యకర్తల్ని రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేస్తున్న నారా లోకేష్‌పై చర్యలు తీసుకోవాలని పాత గుంటూరు పోలీసు స్టేషన్‌లో వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా సభ్యులు ఫిర్యాదు చేశారు. శుక్రవారం రాత్రి పాత గుంటూరు పీఎస్ సీఐ ఎం.వి.సుబ్బారావును కలసి ఫిర్యాదు చేశారు. సోషల్ మీడియా సభ్యులు మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో లోకేష్ కార్యకర్తలను రెచ్చగొట్టే విధంగా.. ఎక్కువ కేసులు ఉన్నవారికి పదవులు ఇస్తామని వ్యాఖ్యానించడం సిగ్గుచేటని ఖండించారు. కార్యకర్తల్ని రెచ్చగొట్టి అలజడి సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా రాష్ట్రంలో అల్లర్లు ప్రేరేపించేలా లోకేష్ వ్యాఖ్యలు ఉంటున్నాయని విమర్శించారు. అందులో భాగంగా తమ్మళ్లపల్లి, పుంగనూరు, మాచర్ల వంటి నియోజకవర్గ ప్రాంతాల్లో ఘర్షణలు చేసిన విషయాన్ని ఫిర్యాదులో పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ఇలాంటి ఘటనలు జరిగే అవకాశం ఉందని, పచ్చ కార్యకర్తల్ని రెచ్చగొడుతున్న లోకేష్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చన్నాయుడుతో పాటు ఎవరైనా రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీహెచ్.సాగర్, రహమతుల్లా, గోపి, ఖాదర్, సాయిరాం, రమణకుమార్, హనుమంతరావు, కిరణ్‌కుమార్, మస్తాన్ పాల్గొన్నారు.



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న మీడియా సభ్యులు

రేపు చేబ్రోలులో ఉచిత మెగా వైద్య శిబిరం

కొరిటిపాడు(గుంటూరు): చేబ్రోలులోని సూర్యదేవర నర్సయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం గుంటూరు రమేష్ హాస్పిటల్ సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు గుంటూరు జిల్లా ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వి.వి.నాగిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చేబ్రోలు మండల ఎరువులు, పురుగు మందులు, విత్తన డీలర్ల సంఘం సౌజన్యంతో నిర్వహిస్తున్న ఈ శిబిరం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగుతోందని పేర్కొన్నారు. శిబిరంలో ఉచితంగా వైద్య పరీక్షలతో పాటు మందులు కూడా ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఈ అవకాశాన్ని చేబ్రోలు, చుండూరు మండలాల్లోని గ్రామాల రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ట్రాక్టర్లపై కేసులు నమోదు

పట్నంబజారు : 'సాక్షి' లో శుక్రవారం ప్రచురితమైన వేళా పాళా లేదు.. ప్రాణాలంటే లెక్కలేదు కథనానికి రవాణా శాఖ అధికారులు స్పందించారు. జిల్లావ్యాప్తంగా తనిఖీలు నిర్వహించి, నిబంధనలు పాటించని వాహనాలపై కొరడా ఝుళిపించారు. నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న 16 ట్రాక్టర్లపై కేసు నమోదు చేశారు. ఇందులో ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండా తిరుగుతున్న ట్రాక్టర్లు మూడు, డ్రైవింగ్ లైసెన్సు లేనివి ఎనిమిది, పర్మిట్ లేకుండా తిరుగుతున్నవి రెండు, సరైన ధ్రువీకరణ పత్రాలు లేకుండా ఒకటి, పన్ను చెల్లించకుండా తిరుగుతున్నవి ఒకటి, ఇన్స్యూరెన్సు లేకుండా మూడు వాహనాలు, పొల్యూషన్ సర్టిఫికెట్ లేకుండా తిరుగుతున్న రెండు ట్రాక్టర్లు, రిఫ్లెక్టర్ లేకుండా తిరుగుతున్న రెండు వాహనాలు కలిపి మొత్తం 16 ట్రాక్టర్లపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా డీటీసీ షేక్ కరీమ్ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు రోడ్డుపై తిరిగితే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించబోమని తెలిపారు. పూర్తి స్థాయిలో ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ధ్రువీకరణ పత్రాలు, లైసెన్సు కలిగి ఉన్న వారు మాత్రమే రోడ్డుపైకి రావాలని స్పష్టం చేశారు.రోజూ జిల్లా వ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని, నిబంధనలు పాటించని వాహనాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్



జరిమానా విధించిన ట్రాక్టర్‌తో ఆర్టీవో అధికారులు

ప్రజాప్రతినిధుల అర్జీల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం

నెహ్రూనగర్: ప్రజాప్రతినిధుల నుంచి అందే ఫిర్యాదులు, అర్జీల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని విభాగాధిపతులకు నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. శుక్రవారం తన చాంబర్‌లో కార్పొరేటర్లతో వార్డుల్లో అభివృద్ధి పనులు, స్థానిక సమస్యలపై ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రజాప్రతినిధులు ప్రజలతో మమేకమై ఉంటారని, వారు గుర్తించిన సమస్యల్ని వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారుల్ని ఆదేశించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసినప్పుడే ప్రజా సమస్యలు పరిష్కారం, నగర సమగ్రాభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. ప్రతి సోమవారం స్పందన, ప్రతి రోజు వార్డు సచివాలయాల్లో మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు ప్రజా స్పందన నిర్వహిస్తున్నామని తెలిపారు. వార్డుల్లో మౌలిక వసతులు, అభివృద్ధి పనులపై కార్పొరేటర్లు కూడా కమిషనర్‌తో చర్చించడానికి ప్రత్యేక సమయం కావాలని కోరినందున శుక్రవారం కేటాయించినట్లు చెప్పారు. మిగిలిన రోజుల్లో కూడా అందుబాటులో ఉంటామని, వాట్సాప్‌లో తెలిపినా చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. కార్పొరేటర్ల నుంచి అందే అర్జీలు, ఫిర్యాదులు, ప్రతిపాదనల్ని క్రమపద్ధతిలో రికార్డ్ చేసి, తదుపరి చర్యలు కూడా వారికి తెలిపేలా అధికారుల్ని ఆదేశించారు.



కార్పొరేటర్లతో మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి చేకూరి

హక్కుల పరిరక్షణ ప్రభుత్వాల బాధ్యత

నెహ్రూనగర్: ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు రాజ్యాంగం కల్పించిన హక్కుల్ని పరిరక్షించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. అంబేడ్కర్ భవన్‌లో శుక్రవారం ఎస్సీ, ఎస్టీ, ఉద్యోగ సంఘాల నాయకులతో కలసి రాజ్యాంగ పరిక్షణకు సెప్టెంబర్ 9న విజయవాడలో నిర్వహించనున్న సదస్సు సన్నాహక సమావేశం నిర్వహించారు. ముందుగా సదస్సుకు సంబంధించిన కరపత్రాల్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన అసైన్డ్ భూముల ఆర్డినెన్స్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని, పదోన్నతుల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం లైజనింగ్ ఆఫీసర్‌ని నియమించాలని విజ్ఞప్తి చేశారు. మాల మహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టాన్ని పటిష్టంగా అమలు చేసి, బాధితులకు సత్వర న్యాయం చేకూర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించి వారికి రిజర్వేషన్ ఫలాలు అందించాలని విన్నవించారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు చార్వాక, కనపర్తి సంగీతరావు, మురికిపూడి దేవపాల్, కిరణ్‌కుమార్, అశోక్‌కుమార్, కోడిరెక్క కోటిరత్నం, నల్లపు నీలాంబరం, నాయకులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

వరాలిచ్చే చల్లని తల్లి వరలక్ష్మి !



ఆర్. అగ్రహారం శ్రీకన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారు



ఆర్. అగ్రహారం శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయంలో వ్రతం చేస్తున్న మహిళలు



ఆర్. అగ్రహారంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

పాత గుంటూరు: వేడుకున్నంతనే వరాలిచ్చే చల్లని తల్లి వరలక్ష్మి అని శాసనమండలి సభ్యుడు లేళ్ల అప్పిరెడ్డి తెలిపారు. ప్రత్యేకించి మహిళలకే కాకుండా యావత్ సమాజానికే అత్యంత మంగళకరమైనది వరలక్ష్మి వ్రతమని ఆయన పేర్కొన్నారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆర్. అగ్రహారంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో సాముహిక కుంకుమార్చనలు, వరలక్ష్మి వ్రతాలు, పుష్పార్చనలు జరిగాయి. కార్యక్రమంలో ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి పాల్గొని అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సకల శుభాల్ని ప్రసాదించే వరలక్ష్మి అనుగ్రహంతో అందరి ఇంట ఆనందాలు వెల్లివిరియాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు.

■ శ్రావణ శుక్రవారం సందర్భంగా శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారిని ఎమ్మెల్యేలు షేక్ మహమ్మద్ ముస్తఫా, మద్దాళి గిరిధర్‌రావు, నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టి.ఎల్.వి.వీరాంజనేయులు, పులిగొండ శ్రీనివాస్, తాడికొండ పవన్ కుమార్, పానుగంటి చైతన్య, నూనె కిశోర్, గుడిపాటి భాస్కర్, నిడమానూరు సురేష్, ఈవో పాదర్తి దుర్గారావు, పలువురు కార్పొరేటర్లు, దేవరశెట్టి చిన్ని పాల్గొన్నారు.

■ ఏటీ అగ్రహారంలోని కంచి కామకోటి పీఠ శ్రీ శంకర గాయత్రీ దత్తసాయి సత్యదేవ మందిరంలో వరలక్ష్మి వ్రత పూజను వైభవంగా నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కార్యదర్శి పి.వి. భావన్నారాయణ పర్యవేక్షించారు.



మల్లారెడ్డినగర్‌లో నగదు అలంకరణలో పర్వత వర్ధిని అమ్మవారు

■ బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం శ్రీ పద్మావతి కళావేదికగా ఆలయ ప్రధానార్చకులు మాధవస్వామి, కృష్ణ బృందం మంత్రార్థాలను వివరిస్తూ వరలక్ష్మి వ్రతాన్ని నిర్వహించారు. విశేషంగా భక్తులు పాల్గొన్నారు.



బృందావన్ గార్డెన్స్ ఆలయంలో వరలక్ష్మి వ్రతంలో పాల్గొన్న భక్తులు

విశేష హారతి అనంతరం తీర్థ ప్రసాద వితరణ గావించారు.

■ అరండల్‌పేట నాలుగో లైనులోని శ్రీ అష్టలక్ష్మీ సమేత శ్రీ లక్ష్మీనారాయణస్వామి దేవస్థానం ప్రధాన పూజారి, వ్యవస్థాపకులు మర్రిపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో ఉదయం అభిషేకం, బంగారు కలువపూల పూజ, హారతి అనంతరం విశేషంగా పాల్గొన్న సువాసినులతో వరలక్ష్మి వ్రతం, శ్రీ లలిత సహస్రనామ పారాయణ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సువాసినులకు, భక్తులకు తీర్థ ప్రసాద వితరణ గావించారు.

■ మల్లారెడ్డినగర్ శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయంలో పూజారులు చంద్రశేఖర శర్మ, శివకుమారశర్మ ఆధ్వర్యంలో శ్రావణ శుక్రవారం



అరండల్‌పేట అష్టలక్ష్మీ ఆలయంలో వరలక్ష్మి వ్రతంలో పాల్గొన్న సువాసినులు



గాయత్రి మందిరంలో వ్రతంలో పాల్గొన్న మహిళలు

పూజలు విశేషంగా నిర్వహించారు. శ్రీ పర్వత వర్ధిని అమ్మవారిని పది లక్షల నగదుతో అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ మెట్టు కృష్ణారెడ్డి పర్యవేక్షించారు.

సామాజిక సేవ మరింత విస్తృతం

గుంటూరు ఎడ్యుకేషన్: సామాజిక సేవా కార్యక్రమాల్ని మరింతగా విస్తృత పరుస్తామని డీఎస్సార్ ఫ్రెండ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొత్తపల్లి నాగేశ్వరరావు, కార్యదర్శి దామచర్ల శ్రీనివాసరావు పేర్కొన్నారు. లక్ష్మీపురం మెయిన్ రోడ్డులోని శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాలలో శుక్రవారం రెండో తరగతి విద్యార్థిని మహాలక్ష్మి, యూకేజీ విద్యార్థిని హర్షిణి ఫీజుల నిమిత్తం డీఎస్సార్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.25వేలను అందజేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ అసోసియేషన్ తరఫున పలు సేవా కార్యక్రమాల్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ తిరుమలలోని తరిగొండ వెంగమాంబ ఉచిత అన్న ప్రసాద వితరణకు పలుమార్లు కూరగాయల్ని పంపించామని పేర్కొన్నారు. పాఠశాల కార్యదర్శి పాటిబండ్ల విష్ణువర్ధన్ మాట్లాడుతూ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు వరుసగా మూడో ఏడాది ఉపకార వేతనాలు అందజేశారని వివరించారు.

బీపీ మండల్‌కు ఘన నివాళి

గుంటూరు ఎడ్యుకేషన్: బీసీలు ఆర్థిక, రాజకీయంగా ఎదగాలని కాంక్షించిన బీపీ మండల్ ఆశయాల బాటలో పయనించాలని పశు సంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ తుపాకుల మోహనరావు పేర్కొన్నారు. శుక్రవారం బిహార్ మాజీ సీఎం బీపీ మండల్ జయంతి సందర్భంగా అమరావతి రోడ్డులోని ఆయన విగ్రహానికి బీసీ ఉద్యోగ సంఘ ఆధ్వర్యంలో పూలమాల అలంకరించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మోహనరావు మాట్లాడుతూ బీపీ మండల్ సేవల్ని స్మరించుకుని, గౌరవించుకోవడం బీసీలను గౌరవించుకోవడమేనని తెలిపారు. లేపాక్షి చైర్మన్ బడిగించల చంద్రమౌళి మాట్లాడుతూ బలహీనవర్గాలు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలని కోరుకున్న బీపీ మండల్ ఆశయాలను నిజం చేసుకోవాల్సిన బాధ్యత బీసీ సమాజంపై ఉందని చెప్పారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు అనంత మల్లికార్జునరావు, బాలస్వామి, జువ్వా జ్ఞానేశ్వరరావు, బంధనాదం కుమార్‌రాజు, కె. నరసింహారావు పాల్గొన్నారు.



బీపీ మండల్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీసీ ఉద్యోగ సంఘాల నాయకులు

అవోపా ఆధ్వర్యంలో గోసేవ

గుంటూరు ఎడ్యుకేషన్: ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) ఆధ్వర్యంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా గుంటూరువారితోటలోని గోశాలలో గోపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా అవోపా అధ్యక్షుడు కె.వి.బ్రహ్మం మాట్లాడుతూ శ్రావణ శుక్రవారం పవిత్రమైన రోజున సకల దేవతా స్వరూపమైన గోవును పూజించడం ద్వారా సకల పాపాలు హరిస్తాయని తెలిపారు. గోశాలలో సేవ చేయడం ద్వారా రోగాలు దరిచేరవని చెప్పారు. ఈ సందర్భంగా మహిళలు గోమాతను శుభ్రం చేసి పసుపు కుంకుమలతో అలంకరించి, పూజించారు. అనంతరం గోవులకు ఆహారాన్ని అందజేశారు. కార్యక్రమంలో అవోపా కోశాధికారి మహంకాళి శ్రీనివాసరావు, గోసేవ కన్వీనర్ చామర్తి రమేష్, సునీత, కోటిరత్నం, రఘువీర్, రామారావు, మద్ది సాయి రమేష్ పాల్గొన్నారు.

చంద్రయాన్–3 విజయం అభినందనీయం

లక్ష్మీపురం: అంతర్జాతీయ అంతరిక్ష పరిశోధనల్ని కీలక మలుపు తిప్పే ఒక అసాధారణ విన్యాసమైన చంద్రయాన్-3 మిషన్ అఖండ విజయం వెనుక వందలాది శాస్త్రవేత్తల నాలుగేళ్ల కృషి ఉందని అంతరిక్ష శాస్త్రవేత్త చందు సాంబశివరావు పేర్కొన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శుక్రవారం చంద్రయాన్-3 విజయంపై అభినందన సభను సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త సాంబశివరావు మాట్లాడుతూ ఎవరికీ లొంగని చంద్రుడి దక్షిణ ధ్రువంపై విక్రమ్ లాండర్‌ని దించి తీరాలన్న లక్ష్యంతో మన శాస్త్రవేత్తల సాహస ప్రయత్నం ప్రపంచ దేశాల్ని అబ్బుర పరిచిందని తెలిపారు. ఇదొక చారిత్రక ఘట్టమని పేర్కొన్నారు. గత 41 రోజులుగా అన్ని విభాగాలకు చెందిన శాస్త్రవేత్తలు, పరస్పర సమన్వయంతో రెప్పవాల్చని నిఘాతో చంద్రయాన్‌నే శ్వాసించారని వివరించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

చంద్ర మండలం ఎక్కినంత సంబరం

అవార్డులతో తెలుగు సినీ పరిశ్రమ చంద్ర మండలం ఎక్కినంత సంబరం చేసుకుంటుందని సంగీత విద్వాంసుడు పి.మొగిలి అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శుక్రవారం తెలుగు చిత్ర పరిశ్రమకు అభినందనలు తెలిపారు. మొగిలి మాట్లాడుతూ ఆస్కార్ అవార్డుతో అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన తెలుగు చిత్రపరిశ్రమ జాతీయ అవార్డుల్లోనూ సత్తా చాటుకుందని పేర్కొన్నారు. ప్రపంచంలో ఇప్పుడిపుడే తెలుగు సినిమా ప్రతిభను చాటుతోందని తెలిపారు. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, ఇంజినీర్ ఘన శ్యామాచార్యులు, పింగళి భాగ్యలక్ష్మి తదితరులు ప్రసంగించి, అభినందనలు తెలిపారు.

తేజేశ్వర్‌కు అభినందనలు

గుంటూరు వెస్ట్: పోలాండ్‌లో ఈ నెల 10 నుంచి 20 వరకు జరిగిన ఇంటర్నేషనల్ ఒలింపియన్ (ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రో ఫిజిక్స్) ఫైనల్స్‌లో నెగ్గి బంగారు పతకం సాధించిన కోడూరి తేజేశ్వర్‌ను జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి అభినందించారు. స్థానిక కలెక్టరేట్‌లోని చాంబర్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో రాణించడం అభినందనీయమని కొనియాడారు. మన యువత దేశవిదేశాల్లో ప్రతిభకనబరచడం దేశానికే గర్వకారణమన్నారు. నిత్యం నేర్చుకునే విధంగా ఉండాలని చెప్పారు. విజయవాడకు చెందిన ఫిట్జీ విద్యాసంస్థ పిన్నెపు రమేష్‌బాబు సంస్థ తరపున తేజేశ్వర్‌కు రూ.10 లక్షల రివార్డును కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు.



గంగానమ్మ కొలుపులు ప్రారంభం

పాత గుంటూరు: అరండల్‌పేట రజకుల కాలనీలోని గంగానమ్మ తల్లి కొలుపులు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి.అర్చకుడు కమలాకరశర్మ అమ్మవారికి పంచామృతాభిషేకాలు, కలశ పూజల్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు విశేష సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. మాజీ ఎమ్మెల్యే తాడిశెట్టి వెంకట్రావు, మురళి ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమాల్ని ఉత్సవ నిర్వాహకులు వై.వి. సాయి రాఘవ, రజక కాలనీ అధ్యక్షుడు వై. కృష్ణ పర్యవేక్షించారు. శనివారం ఉదయం 10 గంటలకు అమ్మవారికి పొంగళ్లు, సాయంత్రం 5 గంటలకు పల్లకీ ఊరేగింపు జరుగుతుందని, భక్తులు పాల్గొనాలని కృష్ణ కోరారు.



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

రేపు కవి సమ్మేళనం

పాత గుంటూరు: నవ్యాంధ్ర రచయితల సంఘం, బాపు రమణ కళాపీఠం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌వో సమావేశ మందిరంలో కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సయ్యద్ జానీ బాషా తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సభలో 'మా పెనుగొండ కథలు' పుస్తకాన్ని రచయిత పెనుమాక నాగేశ్వరరావు సమీక్షిస్తారని పేర్కొన్నారు.